స్వతంత్ర భారత్ లో

మరణ శిక్షవంటి దినం

# ఒకటవ తేదీ

అంగర సూర్యారావు

(నారాయణ ఈజీఛైర్ లో కూర్చుని పేపరు చదువుతూ వుంటాడు. ఈజీఛైర్ వెనుక ఒక టేబిలు వుంది. టేబులుమీద ఆఫీసు ఫైల్సు, పిల్లల క్లాసు పుస్తకాలు చిందర వందరగా పడి వున్నై. సత్యం ప్రవేశిస్తాడు. వయస్సు 9 సంవత్సరాలు. ఒక హాఫ్ ప్యాంటు, చిరిగి పోయిన చొక్కా వేసుకున్నాడు. జడుస్తూ నెమ్మదిగా ముందుకు వచ్చి ఈజీ చైరుపక్కని నుంచుంటాడు. నారాయణ "ఎందుకు?" అన్నట్లు అతనివైపు చూస్తాడు.)

సత్యం: నాన్నగారూ! ఇవేళ జీతం కట్టక పోతే బడిలో పేరు తీసేస్తారట.

నారా: ఒకటవ తేదీని కడదాంలే! పోయి ఆడుకో.

స: నాకు లెక్కల పుస్తకం తెలుగు పుస్తకం లేవు నాన్నగారూ! పుస్తకాలు తెచ్చుకునేవరకూ మేస్టారు క్లాసులోకి రావద్దన్నారు.

నా: ఒకటవ తేదీని కొందాం. (తిరిగి పేపరు చూస్తూ వుంటాడు)

స: నాకు చిరుగులులేని చొక్కా ఒకటీ లేదు నాన్నగారూ! నన్ను చూసి అందరూ వేళాకోళం చేస్తారు. (బిక్క మొహం వేస్తాడు)

నా: (చిరాకుగా) కుట్టిస్తాను నాయనా! కుట్టిస్తాను. ఒకటవ తేదీని కుట్టిస్తాను. (పేపరు పేజీ తిప్పుతాడు. సత్యం ఒక అడుగు ముందుకు వేసి తిరిగి వస్తాడు.)

స: నాన్నగారూ! ఆకలి వేస్తోంది. ఒక అణా యివ్వరూ! యిడ్లీ కొనుక్కుంటాను.

నా: (చిరాకుగా) ఒకటవ తేదీని. (పేపరు లోకి చూస్తూవుంటాడు. సత్యం ఏడుపు ముఖం పెట్టి యింట్లోకి వెళ్ళిపోతాడు. సత్యం వెళ్లిన క్షణానికి శ్యామల ప్రవేశిస్తుంది.)

శ్యామల: ఇవేళ పేపర్లో ఏం రాశారండీ!

నా: (పేపరులోంచి ముఖం పైకెత్తి) నెహ్రూగారు జపానుదేశానికి ఏనుగును పంపించారట. ఒక తొంభైఏళ్ల ముసలివాడు మూడవ పెళ్లి చేసుకున్నాడట. సినిమా ఫిల్ముల పొడవుపై నిషేధం తీసివేశారట.

శ్యా. అవన్నీ ఎవరో కడుపునిండిన వాళ్లకు. జీతాలు హెచ్చించడం, బియ్యంరేషను ఎక్కువ చెయ్యడం యిటువంటి వార్తలేవైనా వుంటే చెప్పండి.

నా: లేదు శ్యామలా! ఆ విషయమై నువ్వింక ఆశ వదులుకోవచ్చు.

శ్యా: వాటిమీద ఆశ వదులుకోవడంతో పాటు బ్రతుకుమీద కూడా ఆశ వదులుకో వచ్చు. ఆదివారంనాడు రేషను తీసుకువచ్చాం. ఇవేళ బుధవారం. ఈ రాత్రికి అన్నం లేదు. అబ్బ! యింకా మూడు రోజులు అన్నం లేకుండా గడపాలి. ఊళ్లో బియ్యం వున్నై. కాని అవి మనకు అందుబాటులో లేవు. రేరు రూపాయిన్నర. ఇచ్చే రేషను వారం రోజులూ సర్దుకోవాలంటారు. సరే! మనం సర్దుకోడానికి ప్రయత్నిస్తాం. నోరులేని పసిపిల్లలు "అమ్మా! ఆకలి!" అంటే ఏ తల్లి వూరుకుంటుంది! (ఆమె కళ్లలో నీళ్లు తిరుగుతై.)

నా: పిల్లలంటే జ్ఞాపకం వచ్చింది. నిన్న సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ పిల్లలకు బిస్కట్లు తీసుకువద్దామని బేడ బిస్కట్లు కొని జేబులో చెయ్యిపెట్టి చూసేసరికి కాణీ కూడా లేదు. నిన్న ఉదయానికి నా జేబులో పావలా వుంది. సాయంత్రానికి ఏమైపోయిందో తెలీదు.

శ్యా: మీతో చెబుదామనుకొని మర్చిపోయాను. నేనే ఆ పావలా తీసి పెరుగుమనిషికి యిచ్చాను.

నా: మంచిపని చేశావు. (తిరిగి పేపరు చదువుకుంటూ వుంటాడు. రెండు నిముషాలు

గడచిన తరవాత పేపరులోంచి తలఎత్తి) యింటి అద్దె రెండు రూపాయలు ఎక్కువ చేశారు !(సంతోషంతో అన్నాడు.)

"శ్యా: అసలు మీకు జీతం ఎంత? యింటి అద్దె ఎంత?

నా: జీతం 54 రూపాయలు, కరువుభత్యం 22, యింటి అద్దె 5 రూపాయలు. మొత్తం 81 రూపాయలు.

శ్యా: (ఆశ్చర్యంతో) అయ్యయ్యో యింటి అద్దె 5 రూపాయలేమిటండీ? 15 రూపాయల కంటే తక్కువకు ఎక్కడైనా యిల్లు దొరుకుతుందటండీ? మా ఇంటికి అద్దె పదిహేను రూపాయలని మీరెందుకు చెప్పలేదండీ?

నా: ఓ వెర్రి మనిషీ! చెబితే వినేరోజులు పోయినవి. నోరు మూసుకొని ఉదయంనుంచి సాయంత్రంవరకూ యంత్రంలా పనిచెయ్యాలి. యింకా పని పూర్తి కాకపోతే రాత్రంతా కూడా యింటిలో పనిచెయ్యాలి. అంతేకాని "నాకు జీతం చాలదు" "విశ్రాంతి చాలదు" అంటే దేశ ద్రోహంకింద జమకట్టే రోజులు ఇవి. జీతం, విశ్రాంతి, తిండి, బట్ట, యిల్లు మొదలైన పదాలన్నీ రాజకీయాలుగా పరివర్తనం చెందినై. రాజకీయాలంటే ప్రస్తుతం అర్థం యేమిటో తెలుసా? ప్రభుత్వోద్యోగులు అనకూడనివీ వినకూడనివీని. గుప్ చుప్!

శ్యా: కొన్ని దేశాలలో ప్రభుత్వోద్యోగులకు పిల్లలను బట్టి జీతాలు యిస్తారట కదా?

నా: అది నిజమే! కాని మనవాళ్లు అంతకంటే తెలివైనవాళ్లు. దానికో చక్కని ఉపాయం కనిపెట్టారు.

శ్యా: (ఉత్సాహంగా) ఏమిటండీ అది?

నా: పిల్లలు ఎక్కువగా వుంటే కదా జీతాలు హెచ్చించవలిసి వస్తుంది. సంతానం లేకపోతే ఏ పేచీ లేదు, అందుకోసం సంతాన నిరోధం అమలులో పెట్టమని.

శ్యా: (రెండు చెవులు మూసుకొని) రామ! రామ!

నా: (ఒక క్షణం నిశ్శబ్దంగా వుండి) శ్యామలా! ఈ ప్రపంచం చాలా విచిత్రమైనది. అదుగో! ఆ ఎదుటిమేడవైపు చూడు, విద్యుద్దీపాలు కలకల లాడుతున్నై! మనోజ్ఞమైన సంగీతం వినిపిస్తోంది. ముఖంమొత్తి ఆ పిల్లలు మిఠాయిలు బిస్కట్లు విసరివేస్తున్నారు. మన పసిపిల్ల పాలలోకి కూడా లేదనుకొనే పంచదార ఆకొట్లలో బస్తాలతో మూల్గుతోంది. ఆ యింటి యజమాని అజీర్తిరోగాన్ని బాగుచేయడానికి- అదుగో- డాక్టరు స్వయంగా వెడుతున్నాడు. (ఉద్రేకంతో) వారం రోజుల నుండి ప్రాణం విడవడానికి సిద్ధంగా వున్న నీ కొడుకుని చూడ్డానికి డాక్టరు ఏడీ?

శ్యా: (పైటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకొని) వాడికి ఇవేళైనా మందు వేయిస్తారా? లేదా?

నా: ఒకటవ తేదీని.

శ్యా: చూడగా చూడగా మీకు మతిపోయేటట్లు కనిపిస్తోంది. ఒకటవ తేదీ వరకూ మందు వేయించకపోతే వాడు బ్రతుకుతాడా? ఆకలికి తాళలేని కుర్రాడికి కూడా ఒకటవ తేదీ గడువుపెడితే వాడి ఆకలి తీరుతుందా?

నా: ఈ ప్రపంచంలో నూటికి తొంభై మంది ఆకలి తీర్చుకోవడానికి జీవితావసరాలు తీర్చుకోడానికీ పుట్టలేదు. కేవలం బండచాకిరీ చెయ్యడానికీ, కష్టాలు అనుభవించడానికీ పుట్టారు. వీళ్లు పుట్టుకతోనే దారిద్ర్యాన్ని వెంటబెట్టుకువచ్చారు. ఇక మిగిలిన పదిమంది జన్మతోనే శ్రీమంతులై ప్రపంచంలోకి వచ్చారు.

శ్యా: మనం శ్రీమంతులం కానక్కర్లేదు. మనకు మేడలూ మిద్దెలూ అవసరంలేదు. కడుపునిండా తిండి, బట్ట, వుండడానికి కొంపవుంటే చాలు. రోజురోజుకూ దారిద్ర్యం హెచ్చుతోంది. ఈ దరిద్రదేవతనుండి విముక్తి ఏనాటికి కలుగుతుందో తెలియదు. ఒకసారి నావైపు చూడండి. నా బట్టలన్నీ చిరిగిపోయినై పిల్లలకు బట్టలులేవు. జ్వరంతో బాధపడుతున్న కుర్రాడికి మందులేదు. ఇంట్లో ఒక బియ్యపుగింజలేదు. ఇక బాకీలుచూస్తే భయంవేస్తోంది. పాలవాడికి మూడునెలలకు ముప్పైరూపాయలు యివ్వాలి. రెండు నెలలనుండి యింటి అద్దె యివ్వడంలేదు. షావుకారుకు ఏభైరూపాయిలు బాకీ! యీ బాకీలన్నీ యెపుడు తీరుతై? మనం ఎప్పుడు విశ్రాంతిగా జీవితాన్ని గడుపుతాం?

నా: వచ్చే జన్మలో! శ్యామలా! జీవితాన్ని తలుచుకుంటూవుంటే మతి పోతోంది. ఒక్క క్షణం నన్ను విశ్రాంతి తీసుకోనియ్యి. (బరువుగా కళ్లు మూసుకుంటాడు.)

* * *

(ఒకటవ తేదీ. సమయం రాత్రి 8 గంటలు. టేబిలు మీద హరికేన్ లాంపు వెలుగుతూ వుంటుంది. శ్యామల దిగులుగా కుర్చీలో కూర్చునివుంటుంది. సత్యం తొందరగా ప్రవేశిస్తాడు.)

స: అమ్మా! డాక్టరుగారు చీటీ రాసి యిచ్చారు. ఈ మందుకొని రోజుకు రెండు సార్లు తమ్ముడికి పట్టించమన్నారు.

శ్యా: మందులుకొని పట్టించడానికి మన మేమైనా డబ్బున్నవాళ్ళమా నాయనా? వాడి చావు బ్రతుకుల భారం ఆ దేవుడిమీద పెట్టి వూరుకున్నాను. చివరకు చంటిపిల్లకు పాల డబ్బా కొనడానికికూడా మనదగ్గర డబ్బులు లేవు. అది ఏడ్చిఏడ్చి యిప్పుడే నిద్రపోయింది.

స: జీతం కట్టలేదని యివ్వేళ బడిలో నా పేరు తీసేశారమ్మా!

శ్యా: ఇవాళ ఒకటవ తేదీ. మీ నాన్నగారికి జీతం అందుతుంది. రేపు స్కూలుజీతం కట్టవచ్చు.

స: బలే! యివేళ ఒకటవతారీకు కదమ్మా! నాన్నగారు నాకు యివ్వేళ బట్టలు కుట్టిస్తానన్నారు. పుస్తకాలుకూడా కొంటానన్నారు. యిడ్లీ కొనుక్కోడానికి అణాకూడా యిస్తానన్నారు. (సంతోషంతో గెంతుతూవుంటాడు. యింటలో బయటనుంచి "ఏమండోయ్ నారాయణగారూ!" అని పిలుపు వినిపిస్తుంది.)

శ్యా: (సత్యంతో) చూడు! మీనాన్నగారి కోసం ఎవరో వచ్చారు. (సత్యం బయటకు వెడతాడు. రెండు నిముషాలకు తిరిగి వస్తాడు)

స: ఇంటి అద్దెకోసం వచ్చారమ్మా! మూడు నెలల అద్దె యివ్వాలట. యివ్వేళ యివ్వక పోతే యిల్లు ఖాళీ చేయిస్తారట. నాన్నగారు వచ్చిన తర్వాత వస్తామని వెళ్లిపోయారు.

శ్యా: మూడునెలల అద్దె ఒక్కసారి ఎలా యివ్వగలం? నాన్నగారు వచ్చిన తరవాత ఒక నెల అద్దె అయినా యిద్దాం.

(తిరిగి బయటనుంచి "నారాయణగారూ! నారాయణగారూ!" అని పిలుపు వినిపిస్తుంది. సత్యం బయటకు వెళ్ళి రెండు నిముషాల తరవాత తిరిగి వస్తాడు.)

స: అప్పన్న పాలబాకీ కోసం వచ్చాడు. నాన్నగారు లేరంటే మళ్ళా వస్తానని వెళ్ళాడు.

శ్యా: ఓ భగవంతుడా! మాలాంటి నిర్భాగ్యులను ఎందుకు పుట్టిస్తావు! యీ బాకీలు ఈ జన్మలో తీరుతవా?

(బయటనుంచి "ఏమయ్యోయ్ నారాయణా నారాయణా!" అని కేక వినిపిస్తుంది. తిరిగి సత్యం బయటకు వెళ్లివస్తాడు.)

స: అమ్మా డబ్బుకోసం షావుకారు వచ్చాడే! నాన్నగారు యింకా రాలేదంటే వెళ్ళిపోయాడు.

శ్యా: ఇవేళ ఒకటవ తేదీ నాయనా! తెల్లవారితే మన చేతిలో కానీ కూడా వుండదన్న సంగతి బాకీలవాళ్లకు తెలుసు. అందుకే అందరూ ఈ రోజునే వస్తున్నారు. అప్పుడే రాత్రి ఎనిమిది గంటలు దాటింది. ప్రతి ఒకటవ తేదీనీ మీ నాన్నగారు చప్పున వచ్చేవారు. యివేళ యింత ఆలస్యం ఎందుకు అయిందో!

స: అమ్మా! అదుగో! తమ్ముడు మూలుగుతున్నాడమ్మా!

శ్యా: ప్రతిక్షణానికి వాడికి జబ్బు ఎక్కువవుతోంది. భగవంతుడా ఈరోజు గడుస్తుందా లేదా!

స: భగవంతుడంటే ఎవరమ్మా?

శ్యా: లోకంలో ధనవంతులు దరిద్రులూ అని రెండు జాతులను సృష్టించిన మహానుభావుడు.

స: అతను ఎక్కడ వుంటాడమ్మా?

శ్యా: ధనవంతుడు భగవంతుణ్ణి కొనేశాడు నాయనా! ప్రస్తుతం దేవుడు లేడు. అలవాట్లకు బానిసలం కనక మనం యింకా దేవుణ్ణి ప్రార్థిస్తాం.

స: అమ్మా ఆకలి వేస్తోందే! మధ్యాహ్నం కూడా అన్నం పెట్టలేదు.

శ్యా: మీ నాన్నగారు రాగానే వండి పెడతాను.

(వీధి తలుపు చప్పుడు అవుతుంది)

స: (వీథివైపు చూస్తూ) నాన్నగారు! పరుగడతాడు- ఒక పెద్ద మూట భుజాన్ని వేసుకొని నారాయణ ప్రవేశిస్తాడు. అతని వెనుక గెంతుతూ సత్యం ప్రవేశిస్తాడు. నారాయణ మూట టేబిలుమీద దించుతాడు.)

శ్యా: ఏవిటండీ యివి?

(నారాయణ మూట విప్పుతాడు. మూట నిండా బిస్కట్ల పొట్లాలు, నాలుగు చీరలు, మంగుసీసాలు, పాలడబ్బాలు, బట్టలు, పిల్లలు ఆడుకొనే బొమ్మలు వగైరా వుంటై. శ్యామల తెల్లబోయి చూస్తూవుంటుంది.)

నా: ఎందుకు శ్యామలా అలా తెల్లబోతావు? ఎన్ని నెలల నుంచి నీకు చీర కొంటానని ఆశ పెడుతున్నాను? ఇవిగో నీకు నాలుగు చీరలు! సంతోషించక యింకా దిగులుగా కనిపిస్తావేమిటి? ఇవిగో, ఇవి రెడీమేడ్ బట్టలు సత్యానికి. వాడు ఎంతకాలంనుంచి బట్టలు కావాలని ఏడుస్తున్నాడు?

స: (తండ్రి చేతిలోంచి బట్టలు తీసుకొని) బలే! నాన్నగారు నాకు చొక్కాలు లాగులు కొన్నారు.

నా: (సత్యంతో) ఇదిగో నీకొక బిస్కట్ల పేకెట్టు. తమ్ముడికి ఒకటి చెల్లెకి ఒకటి.

శ్యా. ఈ డబ్బంతా ఎక్కడిదండీ?

నా: మనకు డబ్బు ఎక్కడినుంచి వస్తుంది? మడులా! మాన్యాలా? ఈ నెల జీతం అందింది.

శ్యా: అయ్యో! జీతంఅంతా ఖర్చు చేసేశారా?

నా: లేదు! జీతంఅంతా ఖర్చు అవలేదు. ఒకఅణా మిగిలింది, సత్యం! ఇదిగోరా నీకు అణా!

(జేబులోవున్న ఒకఅణా తీసి సత్యానికి యిస్తాడు. సత్యం సంతోషంతో అణా తీసుకొని జేబులో వేసుకుంటాడు. జేబు చిరుగులోంచి అణా నేలమీద పడుతుంది.)

శ్యా: నిజంగా మీకు మతిపోయినట్లు కనిపిస్తోంది. జీతంఅంతా ఒక క్షణంలో ఖర్చు పెట్టేశారే! బాకీలన్నీ ఎలా తీరుస్తారు? బాకీలవాళ్లకు కొంత డబ్బు అయినా యివ్వకపోతే వూరుకుంటారా? యిప్పుడే బాకీలవాళ్లంతా వచ్చి వెళ్ళారు. మరో క్షణంలో మళ్ళా వస్తారు. వాళ్లకేం సమాధానం చెబుతారు?

నా: ఇది నిత్య దరిద్రం. మనకు ఎప్పుడూ వున్నదే! పరువు ప్రతిష్ఠలు నన్ను ఏనాడో విడిచిపెట్టి పోయినై! ఇప్పుడు నేను జీతం అంతా ఖర్చు పెట్టేశానంటావా? అనవసరం ఖర్చు నేనేమీ చెయ్యలేదు. నేను కొన్నవన్నీ అత్యవసరమైనవే! (లోపలనుంచి గట్టిగా మూలుగు వినిపిస్తుంది.)

స: అమ్మో తమ్ముడు!

(శ్యామల వేగంగా లోపలికి వెళుతుంది. చంటి కుర్రాణ్ణి ఎత్తుకొని తీసుకువస్తుంది.)

శ్యా: నాయనా! ఒక్కసారి కళ్లు తెరు! అయ్యయ్యో! ఎగ శ్వాస వచ్చింది. (కుర్రవాడి ప్రాణం తల్లి చేతుల్లోనే పోతుంది. ఆమెకు ఏడుపు కట్టలు తెగి ప్రవహిస్తోంది) నాయనా! ఈ లోకాన్ని విడిచిపెట్టి పోయావా? మీ నాన్నగారు నీకోసం-నీ ప్రాణంపోయే ఘడియలలో మందు తీసుకువచ్చారు నాయనా! ఒక్కసారి కళ్లు తెరు! అగునో! నీకోసం బిస్కట్లు కూడా తెచ్చారు. నువ్వు ఆడుకోవడానికి యివిగో బొమ్మలు - కళ్లు తెరు- నాయనా! (ఏడుస్తుంది.)

నా. (గంభీరంగా) శ్యామలా! ఏడవకు? ఎందుకు వృధాగా ఏడుస్తావ్?- ఏదీ ఒకసారి నాకేసిచూసి నవ్వు- మనస్ఫూర్తిగా సంతోషించు- వాడు చాలా అదృష్టవంతుడు. ఈ లోకాన్ని విడిచిపెట్టి పోయాడు. ఒకవేళ వాడు బ్రతికివున్నాడనుకో! వాడి భవిష్యత్తు ఏమిటో నువ్వు ఆలోచించావా? వాడు గర్భ దరిద్రుడుగా పెరిగి పెద్దవాడై- తిరిగి నాలా ఒక గుమస్తాఅయి నిత్యదరిద్రంతో- అష్టకష్టాలు అనుభవించాలా లేదా? నాయనా! నీకు నా ధన్యవాదాలు!

బయటనుండి "ఏమండోయి నారాయణ గారూ- ఒకటవ తేదీ- పాలబాకీ యిస్తారా లేదా?"

"ఏమయ్యోయ్ నారాయణ- ఒకటవ తేదీ- యివ్వేళైనా నా బాకీ తీరుస్తావా? లేదా?"

"ఈ ఒకటవ తేదీని యిల్లు ఖాళీ చేస్తారా? అద్దె యిస్తారా?" కేకలు వినిపిస్తూవుంటాయి.)